ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన

సస్పెండ్ చేస్తూ డిఇఒ ఉత్తర్వులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల/విజయనగరంటౌన్

మండలంలోని కొండవెలగాడ జెడ్పి హైస్కూలులో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన బయోలజి ఉపాధ్యాయుడు ఎం.వెంకటరావు దొరపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. బాలికల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.గణేష్ మంగళవారం పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టి కేసు నమోదు చేశారు. మరోవైపు డిప్యూటీ డిఇఒ కె.వెంకటరమణ కూడా పాఠశాలకు వెళ్లి విద్యార్థినులను, ఉపాధ్యాయుడిని విచారించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ డిఇఒ ఎం.మాణిక్యం నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజలనెత్తిన సర్దుపోటు

- జిల్లా ప్రజలపై రూ.7కోట్ల విద్యుత్తు భారం
- త్వరలో అమలుకు ప్రభుత్వం సిద్ధం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీల పెంపునకు రంగం సిద్ధమైంది. ఇంధన విద్యుత్ కొనుగోలు ఖర్చు సర్దుబాటు ఛార్జీల పేరిట వినియోగదారుల నుంచి మరో 15 నెలల పాటు అదనపు వసూలు చేసుకునేలా విద్యుత్ నియంత్రణ మండలి నుంచి ఎపిఇపిడిసిఎల్‌కు అనుమతులు ఇచ్చింది. దీంతో సామాన్యుడికి ప్రతి నెలా విద్యుత్ ఛార్జీల షాక్ తగలనుంది. ఇంధన విద్యుత్ కొనుగోలు ఖర్చును ప్రభుత్వం భరిస్తే ఛార్జీల పెంపు ఉండదు. కానీ ఈ సర్దుబాటు భారాన్ని తాము మోయలేమంటూ టిడిపి కూటమి ప్రభుత్వం మొండి చేయి చూపించింది. దీంతో విద్యుత్ ఛార్జీల భారం జనం నెత్తిన పడనుంది. 2022-2023లో వాడిన కరెంటుకు ఈ నవంబర్ నుంచి 2026 జనవరి వరకూ సర్దుబాటు ఛార్జీలు వసూలు చేయనున్నారు. ఈ క్రమంలో గరిష్ఠంగా యూనిట్‌కు రూ.1.55పైసలు వరకు విద్యుత్ ఛార్జీలు పెరిగే అవకాశాలున్నాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా వినియోగదారుల్లో ఆందోళన నెలకొంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన ఐదునెలల్లోనే ఇలా సర్దుబాటు ఛార్జీల రూపంలో ప్రజలపై భారం మోపడంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీనీ ప్రభుత్వం తుంగలో తొక్కిందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

జిల్లాపై సుమారు రూ.7 కోట్ల భారం

జిల్లాలో 9,64,006 విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 7,92,167 గృహ వినియోగ కనెక్షన్లు, 55,552 వ్యవసాయ కనెక్షన్లు, 90,080వాణిజ్య కనెక్షన్లు, 4847 ఇండస్ట్రియల్, 20,688 వీధి దీపాల కనెక్షన్లు ఉన్నాయి. రోజుకు 11 మిలియన్ యూనిట్ల సాధారణ వినియోగం ఉంటుంది. సర్దుబాటు ఛార్జీల వల్ల మరో ఏడుకోట్లు వరకు భారం పెరుగుతుందనే అంచనాలో అధికారులు ఉన్నారు. ఈ భారం నవంబర్ లేదా డిసెంబర్ నుంచి అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధమైంది.

బరుగుదల ఇలా...

ఇంతవరకు గృహ వినియోగదారునికి నెలకు 30 యూనిట్ల లోపు వరకు యూనిట్‌కు రూ.1.90 వసూలు చేస్తున్నారు. తాజాగా ఇంధన సర్దుబాటు ఛార్జీలతో కలిపి ఇదే యూనిట్ కు కనిష్ఠంగా రూ.3.20 వరకు వసూలు చేయనున్నారు. అలాగే 400 యూనిట్ల వరకు నమోదైన వినియోగదారునికి యూనిట్ ధర ప్రస్తుతానికి రూ. 9.75 కాగా ఇక యూనిట్ ధర రూ. 12.30 వరకు పెరగనుంది అంటే ప్రస్తుతం చెల్లించే నెలవారీ కరెంటు బిల్లుకు దాదాపు రెట్టింపు చార్జీల చెల్లించాల్సి వస్తుంది.

ఎన్నికల ముందు హామీ బుట్టదాఖలు

విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూ ఎన్నికల ముందు టిడిపి అధినేత చంద్రబాబు ఎన్నికల బహిరంగ సభలో ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే సర్దుపోటుకు తెరలేపటం వినియోగదారులతో పాటు పార్టీ శ్రేణులలోనూ కలవరం మొదలైంది. ఇప్పటికే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్న విషయం విధితమే. తాజా పరిస్థితుల నేపథ్యంలో వినియోగదారుల ఆగ్రహానికి గురవక తప్పదని స్పష్టమవుతోంది.

ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్ ప్రారంభం

అర్హులైన వారంతా గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోవాలి

మంత్రి కొండపల్లి పిలుపు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం కోసం బుధవారం నుంచి బుకింగ్స్ ప్రారంభమవుతుందని రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అర్హులైన వారందరికీ దీపావళి నుండి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చి, సూపర్ సిక్స్ హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం మండలం ఈడుపురం గ్రామంలో దీపం పథకాన్ని నవంబర్ ఒకటవ తేదీ లాంఛనంగా ప్రారంభిస్తారని మంత్రి తెలిపారు. దీపం -2 పథకం కింద అర్హులైన కుటుంబాలు వారు తమ మొదటి సిలిండర్ పొందేందుకు అక్టోబర్ 29నుంచి 2025 మార్చి 31 వరకు బుక్ చేసుకునే అవకాశం కల్పించామని మంత్రి తెలిపారు.

ఉచిత సిలిండర్ కావాల్సిన వారు సాధారణ పద్ధతిలో ముందుగా సొమ్ము చెల్లించవలసి ఉంటుందని, పట్టణ ప్రాంతాల్లో బుక్ చేసిన 24 గంటల లోపు, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల లోపు గ్యాస్ డెలివరీ ఇస్తారని వివరించారు. ఆ తర్వాత సిలెండర్ డెలివరీ అయిన 48 గంటల్లోపు చెల్లించిన పూర్తి సొమ్మును లబ్దిదారుల ఖాతాల్లో తిరిగి జమ చేస్తారని, ఒక సంవత్సరంలో 3 గ్యాస్ సిలిండర్లు ఇలా ఉచితంగా పంపిణీ చేస్తామని చెప్పారు. అయితే వీటిని ఒకేసారి కాకుండా నాలుగు నెలలకు ఒకసారి బుక్ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని, ఈ దీపావళి తో ప్రారంభమయ్యే ఈ పథకంలో , ప్రతి ఏడాది ఏప్రిల్ 1 నుంచి జూలై 1వరకు మొదటి సిలిండర్, ఆగష్టు 2 నుంచి నవంబర్ 1మధ్య రెండవ సిలిండర్, డిసెంబర్ 1 నుంచి మార్చి 1మధ్య మూడో సిలెండర్ బుక్ చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. ఇలా ఉచిత సిలెండర్ కోసం బుక్ చేసుకున్న దీపం -2 లబ్దిదారులకు ఆయిల్ కంపెనీల నుంచి మెసేజ్ వస్తుందని చెప్పారు.

లబ్దిదారులు సిలిండర్ కోసం ముందుగా చెల్లించిన మొత్తం సిలిండర్ డెలివరీ తీసుకున్న 48 గంటలలో లబ్దిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేయబడుతుందని తెలిపారు. ఉచిత గ్యాస్ సిలిండర్ పొందడానికి కావలసినవి ఎల్.పి.జి. కనెక్షన్, రైస్ కార్డ్, ఆధార్ కార్డు, ఆధార్ కార్డుతో రైస్ కార్డు అనుసంధానం అయి ఉండటమే అర్హతలని, ఎటువంటి సమాచారం లోపం ఉన్న టోల్ ఫ్రీ నెం.1967 కు ఫోన్ చేసి ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని మంత్రి వివరించారు.

నైపుణ్య గణనకు సిద్ధం కండి : జెసి

ప్రజాశక్తి-విజయనగరంకోట

నైపుణ్య గణన-2024 నిర్వహించేందుకు సిద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ ఆదేశించారు. స్కిల్ సర్వే నిర్వహణకు మండలాల నుంచి ఎంపిక చేసిన మాస్టర్ ట్రైనర్లకు స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో నిర్వహించబోయే ఈ నైపుణ్య గణనకు అన్నివిధాలా సంసిద్ధులుగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. సచివాలయ సిబ్బంది ద్వారా ఈ సర్వే జరుగుతుందన్నారు. నిబంధనలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని, ఇంటింటికీ సర్వే కోసం వెళ్లినప్పుడు ఈ గణన అవసరాన్ని యువతకు వివరించి, వారి దగ్గర నుంచి వివరాలను సేకరించాలని సూచించారు. దీనికి సంబంధించిన యాప్ లో అప్లోడ్ చేయాల్సిన అంశాలపై సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాధికారి జి.ప్రశాంత్ కుమార్, జిల్లా ఉపాధి అధికారి, డి.అరుణ, రాష్ట్రస్థాయి మాస్టర్ ట్రైనర్ పృధ్వి, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా బాధ్యులు అశోక్ తదితరులు పాల్గొన్నారు. నవభారత్ సాక్షరత కార్యక్రమం విజయవంతానికి కలసి పనిచేయాలి

సామాజిక బాధ్యతగా అక్షరాస్యత కార్యక్రమం

- ఎంపిడిఒలు, ఎపిఎంలకు కలెక్టర్ పిలుపు
- పోస్టర్లు, శిక్షణ పుస్తకాలు ఆవిష్కరణ

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, డిఆర్‌డిఎ పీడీ తదితరులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా అభివృద్ధి సాధనలో ప్రధాన అడ్డంకిగా వున్న నిరక్షరాస్యతను రూపుమాపేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నవభారత్ సాక్షరత కార్యక్రమం గొప్ప అవకాశమని, దీనిని విజయవంతం చేసేందుకు మండలస్థాయిలో అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని నిరక్షరాస్యులైన 48,578 మంది స్వయంశక్తి మహిళలను అక్షరాస్యులుగా రూపొందించి జిల్లాను వచ్చే ఆరు నెలల కాలంలో సంపూర్ణ అక్షరాస్యత దిశగా నడిపించాలని సూచించారు. నవభారత్ సాక్షరత కార్యక్రమంపై వయోజన విద్యాశాఖ రూపొందించిన పోస్టర్లను, శిక్షణకు ఉద్దేశించిన పుస్తకాలను కలెక్టర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఎంపిడిఒలు వ్యక్తిగత శ్రద్ధ చూపించాలన్నారు. డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి మాట్లాడుతూ నిరక్షరాస్యత అనే సామాజిక రుగ్మతను తొలగించేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎంపిడిఒలు, వెలుగు ఎపిఎంలను కోరారు. స్వయంశక్తి సంఘాల్లో విద్యావంతులైన మహిళలను గుర్తించి వారి ద్వారా ఒక్కో మహిళ మరో పది మందికి చదువు నేర్పేలా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. మండల స్థాయిలో ఎంపిడిఒ ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే కమిటీలో ఎపిఎం, సిడిపిఒ తదితరులు సభ్యులుగా ఉంటారని చెప్పారు. వయోజన విద్యాశాఖ ఉప సంచాలకులు ఎ.సోమేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు 2024 నుంచి 2027 వరకు నవభారత్ సాక్షరత కార్యక్రమం చేపట్టామన్నారు. జిల్లాలో ఐదు నెలల పాటు ఈ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులైన స్వయంశక్తి మహిళలు, మధ్యాహ్న భోజన పథకం వంటపనివారు, ఆయాలు, హెల్పర్లు, నైట్ వాచ్‌మెన్‌లు, అంగన్‌వాడీ హెల్పర్లు, పారిశుద్ధ్య కార్మికులను అక్షరాస్యులుగా రూపొందించా లన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వీరందరికీ ప్రాథమిక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, క్రియాత్మక అక్షరాస్యతలపై అవగాహన కలిపిస్తామన్నారు. ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో రెండు గంటల సమయాన్ని నిరక్షరాస్యులకు చదువు చెప్పేందుకు వలంటీర్లు కేటాయించాల్సి వుంటుందన్నారు. శిక్షణకు అవసరమైన పుస్తకాలు, బోధన సామాగ్రిని అందజేస్తామన్నారు. జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ మాట్లడుతూ జిల్లా అభివృద్ధిలో అక్షరాస్యత ఎంతో కీలకమని పేర్కొన్నారు. వయోజనుల్లో విద్య పట్ల ఆసక్తి కలిగించడం ముఖ్యమని చెప్పారు. డిపిఒ టి.వెంకటేశ్వరరావు, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ వెంకటరామన్, ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి, డిపిఆర్ఒ డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పిఎం స్వానిధి పథకం అమలులో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజయనగరం నగరపాలక సంస్థకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ అవార్డును ప్రదానం చేశారు. మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో కమిషనర్‌ను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పిఎం స్వానిధి పథకం అమలులో విజయనగరం నగరపాలక సంస్థకు అవార్డు రావడం సిబ్బంది సమిష్టి కృషి అని అన్నారు. ఇదే ఒరవడితో మరింత కష్టపడి మరిన్ని అవార్డులు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు.

రాష్ట్రమంత్రి నారాయణ నుంచి అవార్డు అందుకుంటున్న కమిషనర్ నల్లనయ్య

పిట్టాడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న గిరిజన సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణి

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

గిరిజన సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి- మెంటాడ

రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో పల్లె పండగ కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మంగళవారం పిట్టాడ, జిటిపేట గ్రామాలలో పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం 20 కోట్ల రూపాయలు మంజూరు చేశామని మొదటి విడతగా రూ.6.40 కోట్లు గ్రామాల అభివృద్ధి కోసం ఇచ్చామన్నారు. అందులో భాగంగానే పిట్టాడ గ్రామంలో పైడితల్లమ్మ వారి ఆలయానికి రూ. 15లక్షలతో సిసి రోడ్డు, డ్రైనేజీ కాలువల నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తున్నామన్నారు. అనంతరం పల్లె పండగ గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో ఆంధ్ర రిజర్వాయర్ కాలువల పూడికలుతీయడానికి, ఆలయానికి ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఆమెను నేతలు కోరారు. అనంతరం జిటిపేటలో రూ.22లక్షలతో నిర్మించిన రైతు భరోసా నూతన భవనాన్ని ఆమె ప్రారంభించారు. సచివాలయానికి సిసి రోడ్డు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి శంకుస్థాపనచ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తున్నామన్నారు. గతంలో పాలన చేసిన వైసిపి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని, దానిని గాడిలో పెట్టడానికి ప్రభుత్వం విశ్వ ప్రయత్నం చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చలుమూరి వెంకటరావు, ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, అరకు పార్లమెంటు ఉపాధ్యక్షుడు, అధికారి ప్రతినిధిలు గెద్ద అన్నవరం, గొర్లె ముసలినాయుడు, తహశీల్దార్ కె శ్రీనివాసరావు, ఎంపిడిఒ భానుమూర్తి, మాజీ ఎంపిటిసి రెడ్డి పార్వతి, మాజీ జెడ్‌పిటిసి దేశరి భానుమతి, మాజీ సర్పంచ్ రాయి పిల్లి రవిశంకర్, ఎపిఒ చినప్పయ్య, గృహ నిర్మాణ శాఖ ఎఇ డేవిడ్ ప్రసన్న కుమార్, ఆలయ కమిటీ సభ్యులు దేవుడు బాబు, మురళి, సత్యం, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తు గడువు పెంపు

ప్రజాశక్తి-విజయనగరంకోట

పారా మెడికల్ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు స్వీకరణ తేదీని పొడిగించినట్లు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల తెలిపారు. ఇంటర్మీడియట్ అర్హత కలిగిన అభ్యర్థులు రూ.100 దరఖాస్తు రుసుముతో దరఖాస్తులను నవంబర్ 3వ తేదీకి సాయంత్రం 5గంటల వరకు ప్రభుత్వ వైద్య కళాశాలలో తెలిపారు. పూర్తి సమాచారం కోసం www.vizianagaram.ap.gov.in, www.appsahpc.co.in వెబ్ సైట్‌లను సంప్రదించాలని తెలిపారు. పోస్ట్ ద్వారా వచ్చిన దరఖాస్తులను కూడా 3వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా స్వీకరిస్తామని తెలిపారు. అభ్యర్థుల కౌన్సిలింగ్ నవంబర్ 5న ఉదయం 11గంటల నుంచి జరుగుతుందని తెలిపారు. ఇంటర్ బైపిసి చదివిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

రూ.58 లక్షలతో గుంతలను పూడ్చేందుకు ప్రణాళికలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో రూ.58లక్షలతో గుంతలను పూడ్చేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామనికమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. ఈ మేరకు ఎమినిటీస్ కార్యదర్శులు, సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ముందుగా నగరంలో ఉన్న గుంతల గుర్తింపు సర్వేను చేపట్టామన్నారు. ఈ మధ్య కురిసిన వర్షాలకు అనేక ప్రాంతాల్లోని రహదారుల్లో గుంతలు ఏర్పడినట్లు గుర్తించామన్నారు. అన్ని ప్రాంతాలలో ఇప్పటివరకు 1,655 గుంతలు గుర్తించినట్లు తెలిపారు. ఈ గుంతలు పూడ్చేందుకు అవసరమైన అంచనాలను రూపొందించాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించామని, ఇందుకు రూ.58లక్షలు అంచనా వ్యయంగా ప్రతిపాదించారని తెలిపారు. పరిపాలన ఆమోదం పొందిన తర్వాత టెండర్లు పిలిచి డిసెంబర్ 15లోగా గుంతలను పూడ్చివేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

16లోగా పరిష్కరించకపోతే దశల వారీ ఆందోళన

కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మంగళవారం కార్మికులు ధర్నా చేశారు. ఈసందర్భంగా .యూనియన్ కార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు, శ్రామిక మహిళా కన్వీనర్ జి. కుమారి, నాయకులు ఆదినారాయణ ,పైడిరాజు, కృష్ణ మాట్లాడారు. పారిశుధ్య కార్మికులకు 3 నెలల హెల్త్ అలవెన్స్, సరెండర్ లీవులు, డిఎ బకాయిలు, ఇంజనీరింగ్, ఇతర నాన్ పిహెచ్ కార్మికులకు సంక్రాంతి కానుక రూ.1000 ం, విలీన ప్రాంత కార్మికులకు ఇఎస్ఐ పిఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంపు హౌస్, పార్కులు ప్లాంటేషన్ , స్ట్రీట్ లైట్స్ తదితర విభాగాల్లో థర్డ్ పార్టీ కార్మికులకు 3 నుంచి 4 నెలల బకాయి జీతాలు టెండర్ ప్రకారం ఎరియర్స్‌తో సహా చెల్లించాలని, ప్రతి నెలా 10వ తేదీకి జీతాలు ఇవ్వాలని, డిమాండ్ చేశారు. అనంతరం మేయర్ విజయలక్ష్మికి వినతి అందజేశారు. వెంటనే ఆమె ఎంహెచ్‌ఒను పిలిచి మాట్లాడారు. పనిముట్ల సమస్యను వెంటనే పరిష్కరిస్తామని, రక్షణ పరికరాలకు టెండర్ పెట్టామని, పని వేళల మార్పుకు సంబంధించి కమిషనర్ తో మాట్లాడుతానని, మట్టి ఖర్చులు సిఎఫ్ ఎంఎస్ నుంచి కాకుండా జనరల్ పండ్ నుంచి వెంటనే చెల్లిస్తామని, రిటైర్మెంట్ వయసు సంబంధించి పరిశీలిస్తామని, ఇఎస్ఐ, పిఎఫ్ సమస్యల పరిష్కారానికి సానిటరీ ఇన్‌స్పెక్టర్ల ద్వారా సమాచారాన్ని సేకరించి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాయకులు స్పందిస్తూ నవంబర్ 16 లోపు పరిష్కరించకపోతే దశల వారి పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సూరి, రమా, రామరాజు, ఈశ్వరమ్మ, ధనుంజయ, లక్ష్మణ్, రామచంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

18ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు కావాలి

ఓటర్ల సవరణపై నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ

డిఆర్ఒ శ్రీనివాసమూర్తి

ప్రజాశక్తి-విజయనగరంకోట

జనవరి 2025 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని డిఆర్ఒ ఎస్. శ్రీనివాస మూర్తి తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఈనెల 29న డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్స్ పబ్లికేషన్ జరుగుతుందని, ఆ రోజు నుండి నవంబర్ 28 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ జరుగుతుందని డిఆర్ఒ తెలిపారు. ఈ నెల రోజుల్లో ఓటర్ల జాబితాల్లో చేర్పులు, మార్పులు, తొలగింపులు చేపడతామన్నారు. ఫారం 6, ఫారం 7, ఫారం 8 ద్వారా ఆన్లైన్ లో గానీ, పోలింగ్ స్టేషన్ వద్ద గానీ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాలను డిసెంబర్ 12లోగా పరిష్కరిస్తా మన్నారు. తుది ఓటర్ల జాబితా ను జనవరి 6న ప్రచురిస్తామన్నారు. మంగళవారం డిఆర్ఒ తన ఛాంబర్ లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్‌స్థాయి లో నవంబర్ 9, 10 , 23 , 24 తేదీలల్లో ఉదయం 10నుండి సాయంత్రం 5గంటల వరకు స్పెషల్ కాంపెయిన్ నిర్వహిస్తా మన్నారు. బిఎల్ఒలు బూత్ వద్దనే ఉండి క్లెయిమ్‌లు స్వీకరిస్తారని తెలిపారు. సందేహాల కోసం ఓటర్స్ హెల్ప్ లైన్ 1950 నెంబర్‌కు కాల్‌చేసి తెలుసుకోవచ్చునని తెలిపారు.

విద్యార్థులకు హెల్త్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రీయ బాల స్వాస్త్య కార్యక్రమంలో స్కూల్ హెల్త్ కార్డ్‌లు జిల్లాలో గల అన్ని పిహెచ్‌సి, యుపిహెచ్‌సిల పరిధిలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు మూడురకాల హెల్త్‌కార్డులు ఇచ్చామని డిఎంహెచఒ ఎస్.భాస్కరరావు తెలిపారు. 6 నెలల నుండి ఐదు సంవత్సరాల పిల్లలకు అంగన్‌వాడీ సెంటర్లకు, ఒకటవ తరగతి నుండి 5వ తరగతి పిల్లలకు, ఆరో తరగతి నుంచి 10వ తరగతి పిల్లలకు అన్ని స్కూళ్లకు ఇచ్చామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు 68121 హెల్త్ కార్డులు, ఒకటి నుండి 5వ తరగతి ఎలిమెంటరీ స్కూల్ పిల్లలకు 59853 హెల్త్ కార్డులు, 6వ తరగతి నుండి 10వ తరగతి హైస్కూల్ పిల్లలకు 89602 హెల్త్ కార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

లైంగిక దాడులను అరికట్టాలి : ఐద్వా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో రోజురోజుకూ చిన్నారులపైనా, మహిళలపైనా అత్యాచారాలు తరచూ జరుగుతున్నాయని అన్నారు. ఇటీవల కాలంలో కడప .జిల్లాలో ప్రేమ పేరుతో హింసించి, పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన దారుణమని పేర్కొన్నారు. రామభద్రపురం, నంద్యాలలో చిన్నారులపై ఆత్యా చారాలు ఘటనలు వెలుగు చూశాయని తెలిపారు. వీటిని మరువకముందే తాజాగా గ్యంటాడ మండలంలో చిన్నారిపై ఆత్యాచారం ఘటన చోటు చేసుకుందని, ఇలా రోజుకో సంఘటన జరుగుతున్నా ప్రభుత్వం వాటిని అరికట్టడంలోను, మహిళలకు రక్షణ కల్పించడంలోను విఫలమైందని అన్నారు. అధికారంలోకి వస్తే మహిళలకు రక్షణ కల్పిస్తామని చెప్పిన డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ నేడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో 32వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని చెప్పిన పవన్ కల్యాణ్ నేడు అత్యాచారాలపై ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. గంజాయి, తదితర మత్తు పదార్థాల వల్లే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలని కోరారు.

9 నుంచి నాటిక పోటీలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

నవంబర్ 9,10,11 తేదీల్లో అభినయ - నాటకశాల సంయుక్త నిర్వహణలో నటరత్న నాటక పరిషత్ 8వ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు అభినయ శ్రీనివాస్, కార్యదర్శి గెద్ద వరప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆహ్వాన నాటక పోటీలకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ ఈ అభినయ నాటక పరిషత్‌ను 2015 సంవత్సరంలో స్థాపించిన నుంచి నాటి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. మూడు రోజులు పాటు రోజుకు రెండు నాటికలు చొప్పున నిర్వహిస్తామన్నారు ఈ నాటికలన్నీ సమాజ అభ్యున్నతికి, పురోగమనానికి ఎంతో తోడ్పడతాయని తెలిపారు కార్యక్రమంలో సభ్యులు సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం సభ్యులు

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇఒపిఆర్‌డి శంకర్ జగన్నాథ్ ఆధ్వర్యంలో జరిగింది. పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులుగా కొండగుంపాం కార్యదర్శి లెంక తౌడు, కార్యదర్శిగా సీతారామునిపేట కార్యదర్శి కె.బంగార్రాజులను ఎన్నుకున్నారు. పి.శ్రీదేవి వైస్ ప్రెసిడెంట్, ఆర్.సురేష్ ట్రెజరర్, ఎ.సంతోష్‌కుమార్ జాయింట్ సెక్రెటరీ, మోహన్, సత్యం వెంకట్రావు, శ్రీనివాసరావు ఈసీ మెంబర్లుగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఇఒపిఆర్‌డి తదితరులు అభినందించారు.

ఉపాధి హామీ నిర్వీర్యం

బొబ్బిలి: రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదర్ విమర్శించారు. ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో చేపట్టాల్సి ఉన్నప్పటికీ వెండర్ ద్వారా చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. టిడిపి నాయకులకు పనులు అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఉపాధి పనులను గ్రామ సర్పంచులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం చేస్తామన్నారు.

సిబ్బంది అందుబాటులో ఉండాలి

వేపాడ: పిహెచ్‌సి సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని ఎంపిపి దొగ్గ సత్యవంతుడు అన్నారు. స్థానిక పిహెచ్‌సిలో మంగళవారం అభివృద్ధి సలహా సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో పరికరాలు, పరిసరాలను పరిశీలించారు. సమస్యలు తెలుసుకొని వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, తహశీల్దార్ రాములమ్మ, వైద్యాధికారి ధరణి, నాయకులు రుద్ర వెంకటరావు, భోజంకి శ్రీను, హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్టూన్ పోటీల్లో బహుమతి

బొబ్బిలి: జ్యోతిష్యం, వాస్తు కార్టూన్ పోటీలలో బొబ్బిలి పట్టణానికి చెందిన కార్టూనిస్ట్ భానుకు తృతీయ బహుమతి వచ్చింది. ప్రముఖ కార్టూనిస్ట్ భీమ్ జన్మదిన సందర్భంగా కార్టూన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో భాను మూడో స్థానంలో నిలవడంతో హైదరాబాద్ సరస్వతి భవనంలో నిర్వహించిన జన్మదిన వేడుకలలో ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్, సినీ నటుడు గుండు సుదర్శన్, తెలంగాణ రాష్ట్ర మాజీ సలహాదారు కెవి రమణాచారి సన్మానించి బహుమతిని, ప్రశంస పత్రాన్ని అందజేశారు. సమాజ చైతన్యానికి కార్టూనిస్టులు పని చేయాలని వారు కోరారు. తాను మూడో బహుమతి అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని భాను అన్నారు.

ఎంపిపి పాఠశాల సందర్శన

వేపాడ: మండలంలోని ఎన్‌కెఆర్‌పురం ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఇఒ జి.జగదీశ్వర రావు సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, టాయిలెట్స్, వంటగది, కిచెన్ గార్డెన్ పరిశీలించారు. అంతరం విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీష్ చదివించడం, రాయించడం, అంకెలు సంఖ్యలు, చతుర్విధ ప్రక్రియలు చేయించడం, వర్క్‌బుక్, పరిశీలన చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.తాతబాబు, ఎ.రాము, సిఆర్‌పిలు డి.కోటేశ్వరరావు, కె.రామ ప్రసాద్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆపన్న హస్తం

బొండపల్లి: మండలంలోని గొట్లాం పంచాయతీలో గల పేటలో మంగళవారం అగ్ని ప్రమాద బాధితులకు తహశీల్దార్ డి.రాజేశ్వర రావు ఆపన్న హస్తం అందించారు. ఈ మేరకు తహశీల్దారు సొంతంగా 25 కేజీలు బియ్యం, మూడు వేలు రూపాయలు నగదు, కుటుంబ సభ్యులకు దుస్తులు అందజేశారు. కాగా తన సొంత సొమ్ముతో అగ్ని భాదితలను ఆదుకొని తన ఉదారతను చూపించిన తహశీల్దారు రాజేశ్వరరావును పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ డిటి. రాజేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షుడు కోరాడ కృష్ణ, గొట్లాం మాజీ సర్పంచ్ తాళ్ళపూడి రమణ, విఆర్వోలు కళ్యాణి, శివ, ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే పై గ్రామ సభ

మెరక ముడిదాం: మండలంలోని బాడాం గ్రామంలో మంగళవారం రీసర్వేపై మండల అధికారులు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రఫీజ్ మాట్లాడుతూ రీసర్వేపై ఎవరికైనా సమస్యలు ఉన్నట్లయితే తెలపవచ్చునని చెప్పారు. అనంతరం ప్రజలు నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ పలువురు పాల్గొన్నారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కేసులు

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే బైండోవర్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ వెలమల ప్రసాదరావు హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్లో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించవద్దని ఆదేశించామని తెలిపారు. ఎక్సైజ్ నిబంధనల మేరకు మద్యం అమ్మకాలు చేపట్టాలన్నారు. దీపావళి పండగ సందర్భంగా అక్రమ మందుగుండు సామాన్లు విక్రయించరాదని, బాణాసంచా కాల్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమా దాలు నిరోధించడానికి ప్రభుత్వ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు.

డ్రోన్ కెమెరాలతో ప్రమాద స్థలాల గుర్తింపు

డెంకాడ: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రోడ్లలో డ్రోన్ కెమెరాల ద్వారా ప్రమాద స్థలాలను ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు మంగళవారం గుర్తించారు. మండలంలో ఉన్న జాతీయ రహదారిలో విజయనగరం నుంచి విశాఖపట్నం, శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం రహదారుల్లో ప్రమాదాలు ఎక్కువగా జరగడంతో ఆ ప్రాంతంలో ప్రమాద స్థలాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించామన్నారు. శ్రీకాకుళం విశాఖపట్నం జాతీయ రహదారిలో నాతవలస. టోల్ ప్లాజా విజయనగరం నుంచి విశాఖపట్నం రహదారిలో చింతలవలస, అయినాడా జంక్షన్, బొడ్డవలస జంక్షన్, బొడ్డవలస పెట్రోల్ బంక్ ఆపోజిట్ జొన్నాడ జంక్షన్, లెండి కాలేజీ వద్ద ప్రమాద స్థలాలను గుర్తించామని ఆయన తెలిపారు. ఈ స్థలాల్లోనే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు గుర్తించిన చోట ప్రమాద బోరు డ్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను నియమించాలి

బొబ్బిలి: మున్సిపాలిటీలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులను నియమించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు పి.శంకరరావు కోరారు. పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కమిషనర్ ఎల్.రామలక్ష్మికు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో జనాభా పెరుగుతున్న పారిశుధ్య కార్మికులను పెంచకపోవడంతో పని ఒత్తిడి పెరుగుతుందన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులను పెంచాలని, పనిముట్లు, రక్షణ పరికరాలు ఇవ్వాలని, భద్రతా సౌకర్యాలు మెరుగుపరచాలని, ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్ ఆధారంగా విభజించి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనిఫామ్, సబ్బులు, కొబ్బరి నూనె, గ్లౌజులు ఇవ్వాలని కోరారు. పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు యుగంధర్, ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై తహశీల్దార్‌కు ఫిర్యాదు

భోగాపురం: మండలంలోని రావాడ రెవెన్యూ పరిధిలో ఉన్న తన భూమిని రావాడ గ్రామానికి చెందిన వైసిపి నాయకులు వారి పేరు మీద ఆన్ లైన్ చేసుకున్నారని అవనాపు లక్ష్మణ అనే వ్యక్తి తహశీల్దార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 145/37ఏలో 43సెంట్లు ఉండగా ఇందులోని అరున్నర సెంట్లు గ్రామానికి చెందిన నాయకుడు దంతులూరి వాసుదేవ వర్మ తన పేరు మీద ఆన్లైన్ చేసుకున్నారని తెలిపారు. సర్వేనెంబర్ 180లో ఆరు సెంట్లను వైసిపి వార్డు మెంబర్ పట్నా నారాయణమ్మ ఆన్లైన్ చేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై తమరు విచారణ జరిపి వారి పేర్లు తొలగించి తనకు న్యాయం చేయాలని తహశీల్దార్‌ను ఆయన కోరారు.

మండల సమావేశంలో రాజకీయ రచ్చ

● సమస్యలపై చర్చించాల్సిన సమయానికి టిడిపి, వైసిపి నాయకుల మధ్య వాగ్వివాదం ● తూతూ మంత్రంగా ముగిసిన సమావేశం

ప్రజాశక్తి - రేగిడి

మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశంలో సర్పంచులు, ఎంపిటిసిలు గ్రామస్థాయి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించుకునే పనిచేయకపోగా సమస్యలపై చర్చించకుండా రాజకీయం చేసేయడం చర్చనీయాంశమైంది. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిపి ధార అప్పల నరసమ్మ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వైసిపి ఎంపిపి నాయకత్వం వహించగా, టిడిపి శ్రేణులు ప్రతి గ్రామం నుంచి ఐదుగురు చొప్పున రావాలని నిర్ణయించడంతో ఇరు పార్టీ వాళ్లు వస్తారని ఊహించి ఎంపిడిఒ శ్యామలకుమారి ముందస్తుగానే ఎస్ఐ లీలావతికి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. సభ్యులు కాని వారిని సమావేశానికి రానివ్వకుండా నివారించారు. ఎంపిపి అధ్యక్షత ఉండగా వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెం నాయుడు, వావిలపల్లి జగన్మోహన్ రావులను ప్రోటోకాల్ ప్రకారం స్టేజిపై ఉండరాదని ఎంపిడిఒ తిరస్కరించారు. దీంతో సభ్యులు కూర్చున్న చోట వైస్ ఎంపిపిలు కూర్చున్నారు. సమావేశం ప్రశాంతంగా జరుగుతు ఒదన్న సమయంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సమావేశానికి హాజరయ్యారు. వైస్ ఎంపిపిలను స్టేజిపై ఎందుకు కూర్చో బెట్టలేదని ఎంపిడిఒపై మండిపడ్డారు. ప్రోటోకాల్ ప్రకారం నడుస్తున్నానని ఎంపిడిఒ సమాధానం చెప్పారు. దీంతో చేసేదేమీ లేక వైస్ ఎంపిపిలు సభ్యులతో కలిసి కూర్చున్నారు.

ఉపాధి హామీ పథకం సమీక్షలో భాగంగా ఈసీ రామినాయుడు గ్రామస్థాయి పనులపై మాట్లాడుతుండగా వైస్ ఎంపిపి జగన్మోహన్‌రావు, ఎమ్మెల్సీ విక్రాంత్ అడ్డు తగులుతూ గత నెల 23న ఉపాధి హామీ పథకంలో భాగంగా 39 పంచాయతీలలో 31 పంచాయతీలకు తీర్మానాలు ఉన్నా మిగతా 8 పంచాయతీల తీర్మానాలు లేకుండా ఎలా జాబితా తయారు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. నిబంధనలు పాటించకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. గృహ నిర్మాణం సమీక్షలో భాగంగా ఎఇ కనకయ్య మాట్లాడుతూ బిల్లులు అందని వాటిని యాప్ ద్వారా అన్ని గృహాలకు ఫోటోలు తీసి పంపించాలని సభకు తెలిపారు. దీంతో ఎమ్మెల్సీ కలుగజేసుకొని రెండు ప్రభుత్వాలలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని చెప్పడంతో కోడిశ సర్పంచ్ రమేష్ నాయుడు, ఉంగరాడ సర్పంచ్ చల్ల శోభారాణి వైసిపి ప్రభుత్వంలో టిడిపి సర్పంచుల తీర్మానం లేకుండా ఎలా పనులు చేశారని ఎమ్మెల్సీని ప్రశ్నించారు. ఐకెపి వెలుగు సమీక్షలో ఎపిఎం బాసిన గోవిందరావు మహిళ సంఘాల అభివృద్ధి కోసం చర్చిస్తుండగా ఎమ్మెల్సీ అడ్డుతగిలి వివోఎలు, సిఆర్‌పిలను నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ ఒత్తుళ్లకు లొంగి తొలగించడం సబబు కాదని చెప్పారు. వైస్ ఎంపిపి అచ్చెం నాయుడు చిన్న శిర్లాం గ్రామంలో జేఎల్ఎం బాలరాజు పూర్తిగా పనిచేయలేదని సరెండర్ చేసేందుకు తీర్మానం చేయాలని ఎంపిడిఒను కోరారు. ఈ సందర్భంగా వ్యవసాయ, విద్యాశాఖ, రెవెన్యూ, ఐసిడిఎస్, ఆర్‌డబ్ల్యుఎస్, వైద్యం శాఖలపై నామమాత్రంగానే చర్చ జరిగింది.

ప్రొటోకాల్‌పై ఎంపిడిఒను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

మహిళా సర్పంచ్‌పై ఎమ్మెల్సీ వ్యక్తిగత దూషణ

మండలంలోని ఉంగరాడ మహిళా సర్పంచ్ చల్ల శోభారాణి పై ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ వ్యక్తిగత దూషణ చేయడం పట్ల ఆమెతో పాటు టిడిపి మండల అధ్యక్షులు కిమిడి అశోక్ కుమార్, టిడిపి నాయకులు దూబ ధర్మారావు, కర్నేన మహేశ్వరరావు, చల్ల భుజంగరావు మండిపడ్డారు. సర్వసభ్య సమావేశంలో మహిళా సర్పంచ్ శోభారాణిను భర్త పదేళ్లపాటు విడిచిపెట్టి, ఇబ్బందులు పెట్టారని అది మరిచిపోయావా గుర్తుచేసుకోమని ఎమ్మెల్సీ దూషించడం సిగ్గుచేటన్నారు. వ్యక్తిగత దూషణ పట్ల మహిళా సర్పంచ్, టిడిపి నాయకులు ఎంపిడిఒ కార్యాలయం ఎదుట కొద్దిసేపు ఆందోళన చేపట్టి అభ్యంతర వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వంలో తమ పంచాయతీకి సర్పంచ్‌గా ఉన్న ఎటువంటి తీర్మానం లేకుండా పనులు చేయడం పట్ల మహిళా సర్పంచ్ శోభారాణి ఎమ్మెల్సీను ప్రశ్నించడంతో ఆయన వ్యక్తిగత దూషణకు దిగడం బాధాకరమన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు

రాష్ట్ర స్థాయి క్రీడల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వేపాడ

కర్నూలు డిఎస్ఆర్ అవుట్ డోర్ స్టేడియంలో జరిగిన అండర్ -19 రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ ఉషారాణి మంగళవారం తెలిపారు. 1500 మీటర్ల పరుగులో బి. రేవతి, 4 కిలోమీటర్లలో కీర్తి, 400 మీటర్లలో తనుశ్రీ విజయం సాధించారన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన టీం గేమ్‌లో ప్రవళిక, జ్యోత్స్న మూడో స్థానం సాధించారని తెలిపారు. జావిలిన్‌త్రోలో డి శిరీష మూడో స్థానం, రేస్ వాక్‌లో కీర్తి నాలుగో స్థానం సాధించినట్లు తెలిపారు. క్రీడాకారులు విజయం సాధించే విధంగా తర్ఫీదు ఇచ్చిన పిఇటి అరుణ, పీడీ సంతోషి కుమారిలను ఆమె అభినందించారు. రాష్ట్ర స్థాయిలో సాధించిన సర్టిఫికేట్‌లు విద్యార్థినిలకు అందించామని ప్రిన్సిపల్ తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న రియల్ మాఫియా

ప్రజాశక్తి - కొత్తవలస

మండల కేంద్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి తన అనధికారిక లే అవుట్‌కు వెళ్లేందుకు రెవెన్యూ అనుమతులు లేకుండానే వీర సాగరం చెరువుకు వచ్చే గెడ్డ వాగుపై అక్రమంగా రహదారి నిర్మించేందుకు జెసిబి, తన అనుచరులతో మంగళవారం గెడ్డ వద్దకు చేరుకొని రహదారి నిర్మించే ప్రయత్నం చేశాడు. దీంతో స్థానికంగా ఉన్న శ్రీరామనగర్ కాలనీకి చెందిన కొంతమంది మహిళలు అడ్డుకోవడంతో బెదిరింపులకు పాల్పడ్డాడని మహిళలు తెలిపారు. వారందించిన వివరాలు ప్రకారం..

సర్వేనెంబర్ 158లో రికార్డుల ప్రకారం డి.పట్టా భూమిగా ఉన్న సుమారు రెండు ఎకరాల స్థలంలో అనధికారిక లే అవుట్‌ను వేసి ఇప్పటికే అమ్మకాలు జరిపారు. దానికి రహదారి నిర్మించేందుకు గతంలో ప్రయత్నం చేయగా అప్పటి తహశీల్దార్ సనపాల రమణరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిషోర్, విఆర్ఒ కృష్ణమోహన్ చొరవతో, ఈ స్థలం ప్రభుత్వానికి చెందినది, ఆక్రమించిన వారు శిక్ష అర్హులు అని బోర్డును ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి పలుమార్లు రహదారి నిర్మాణానికి ప్రయత్నించినా సాధ్యం కాకపోవడంతో ఇప్పుడు మరోసారి తన మంది మర్భాలంతో జెసిబి వాహనంతో గెడ్డపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంచెను, బోర్డును తొలగించే ప్రయత్నం చేశాడు. దీంతో తామంతా అడ్డుకుని శ్రీరామ్ నగర్ కాలనీ మధ్యలో రహదారి నిర్మాణానికి అనుమతులు ఎవరు ఇచ్చారని ఇప్పటికే ఈ భూమిపై జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, ఇరిగేషన్ శాఖలకు ఫిర్యాదులు చేశామని వెల్లడించారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వానికి చెందిన భూమి అని బోర్డు ఉన్నా సరే ఎందుకు దాన్ని తొలగించే ప్రయత్నం చేస్తున్నారని జెసిబి వాహనాన్ని అడ్డుకుని వాగ్వాదానికి దిగడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారి తన బెటాలియన్‌తో వచ్చి వారికి బుద్ధి చెబుతానని బెదిరింపులకు పాల్పడ్డాడని స్థానిక మహిళలు మీడియా ముందు ఆందోళన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించే ప్రయత్నం చేస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న, రెవెన్యూ అధికారి రాజేష్, విఆర్ఒ రాధాకృష్ణ, సంఘటనా స్థలానికి చేరుకునేసరికి రియల్ ఎస్టేట్ వ్యాపారి అక్కడి నుంచి ఉడాయించాడని మహిళలు చెబుతున్నారు. సర్వేనెంబర్ 158లో డి.పట్టా భూమిలో అక్రమ లేఅవుట్‌ను వేసి దానికి రహదారి నిర్మించేందుకు గెడ్డ సైతం కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారిపై అధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారి రాజేష్ తెలిపారు.

గెడ్డను కప్పి రహదారి నిర్మించేందుకు ప్రయత్నం

ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును చూపిస్తున్న మహిళలు

ర్యాలీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరతూ ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దారకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా జాయింట్ సెక్రెటరీ కె. రమేష్ మాట్లాడుతూ విద్యా దీవెన, వసతి దీవెన దాదాపు రూ.3,480 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని ఆ నిధులను విడుదల చేయాలని, ప్రభుత్వం తీసుకొచ్చిన తల్లికి వందనంపైన స్పష్టత ఇవ్వాలని కోరారు. సంక్షేమ హాస్టల్లో సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వాలు మారుతున్నా సంక్షేమ హాస్టల్లో పరిస్థితి రోజురోజుకు దిగజారుతోందని చెప్పారు. హాస్టల్స్‌లో సొంత భవనాలు లేకపోవడంతో చాలీచాలని వసతులతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాస్మోటిక్ మెస్ బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండడంతో హాస్టళ్ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. తక్షణమే ఈ సంక్షేమ హాస్టల్ సమస్యలు పరిష్కారం చేయాలని మెస్ బిల్లులు మార్కెట్లో ధరలుకు అనుగుణంగా పెంచాలని డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గర్ల్స్ కో కన్వీనర్ వి. భారతి, జిల్లా కమిటీ సభ్యులు ఏ.అను, వి. చరణ్, మండల ప్రెసిడెంట్ పి. రత్న, నాయుడు, ఇంద్ర, అనిత, చరణ్, జి కార్తీక్, రవి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

ప్రజాశక్తి - వేపాడ

మండలం లోని చినగుడిపాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎడిఎ విజయ, ఎఒ యశ్వంత్ రావు పాల్గొని రైతులకు సూచనలు చేశారు. ప్రస్తుత వరి పంటలో వచ్చే చీడపిడలు గురించి, యజమాన్య పద్ధతులు గురించి వివరించారు. వ్యవసాయ యంత్రీకరణ ఆయిల్ ఇంజన్లు, తార్పన్స్, స్ప్రేయర్స్, రైతు సేవ కేంద్రంలో నమోదు చేసుకొని ఇండెంట్ పెట్టుకోవాలన్నారు. చిరుదన్యాలు రాగి పంట రైతులు అందరు సాగు చేసుకోసుకోవాలని, వర్ష బావ పరిస్థితులను తట్టుకోగలుగుతుందని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవచ్చును అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వేచలపు రామకృష్ణ, వేచలపు నాయుడు బాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సన్యాసమ్మ, యూనిట్ ఇంచార్జ్ నారాయణమ్మ, ఐసిఆర్‌పిలు, రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెం, దేవుపల్లి గ్రామాలలో మంగళవారం మండల వ్యవసాయాధికారి పి.వి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు రైతులకు చేపట్టవలసిన వివిధ యాజమాన్యం పద్ధతులపై అవగాహన కల్పించారు. సేంద్రీయ వ్యవసాయ సాగు ప్రోత్సాహంలో భాగంగా సిబ్బంది పొటాష్ రిలీజింగ్ బ్యాక్టీరియా వాడకం పై ప్రయోగ పూర్వక ప్రదర్శన నిర్వహించారు. వ్యవసాయ సహాయకులు యమున, వివేక్ రైతులు పాల్గొన్నారు.

30న వయోవృద్ధుల దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం కోట

వయో వృద్ధులు సమాజానికి అందిస్తున్న సేవలకు గుర్తిస్తూ, వారిని గౌరవిస్తూ అక్టోబరు నెలను అంతర్జాతీయ మాసోత్సవం నిర్వహించాలని రాష్ట్ర వయోవృద్ధుల సంక్షేమం, వికలాంగుల సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ చేసినట్లు ఆ శాఖ సహాయ సంచాలకులు జివిబి జగదీష్ తెలిపారు. దీనిలో భాగంగా అక్టోబరు 30న మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అదాని కోసమే స్మార్ట్ మీటర్లు

ప్రజాశక్తి- బొబ్బిలి

అదాని కోసమే కేంద్రంలో బిజెపి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తుందని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు అన్నారు. కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు కాంట్రాక్టు పారిశ్రామిక వేత్త అదానికి ఇచ్చారని, అతని కోసమే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు వల్ల ఏ సమయంలో రీఛార్జ్ అయిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోతుందో తెలియదన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.

వెండర్ కోడ్ జిఒను ఉపసంహరించాలి

ప్రజాశక్తి- బొండపల్లి

గ్రామ పంచాయతీలపై ప్రభుత్వం తీసుకొచ్చిన వెండర్ కోడ్ జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని మండలానికి చెందిన పలువురు సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయం పరిపాలనాధికారి తులసీ రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తున్న క్రమంలో ఉపాధి హామీ పథకం ద్వారా మరింత గ్రామాల అభివృద్ధికి సహకరించాల్సిన అవసరం ఉన్నప్పటికీ ప్రభుత్వం గ్రామా పంచాయతీలను నిర్వీర్యం చేసేందుకు వెండర్ కోడ్ జీవోను అమలులోకి తీసుకురావడం భాదాకరమన్నారు. పంచాయతీల తీర్మానం లేకుండా గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో సర్పంచ్‌ల హక్కులు, నిధులు కోసం ఉద్యమించడానికి వెనుకాడబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బి.రాజేరు, వేంద్రాం, కనిమెరక, బొండపల్లి, ముద్దూరు సర్పంచ్‌లు ఈదుబిల్లి కృష్ణ, కర్రోతు శ్రీనువాస రావు, శిరిపురపు ఆదినారాయణ, బొండపల్లి ఈశ్వర రావు, మున కాల పైడిపు నాయుడులతో పాటు పలువురు పాల్గొన్నారు.

గుర్ల : పంచాయతీ నిధులు పక్కదారి పట్టించొద్దని వైసిపి సర్పంచులు మండల పరిపాలన అధికారికి మంగళవారం వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైసిపి మండల నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్‌పిటిసి సీర అప్పలనాయుడు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ చట్టం ప్రకారం ప్రభుత్వ జీవోలకు లోబడి అన్ని గ్రామ పంచాయతీలకు ముంజూరు చేసిన పనులు పంచాయతీల తీర్మానంతోనే జరగా లన్నారు. తీర్మానం సిఫార్స్ లేకుండా ఇతరులతో పనులు చేపట్టి గ్రామపంచాయతీల నిధులు పక్కదారి పట్టించొద్దని మండల పరిపాలన అధికారి వరప్రసాద్, మండల పంచాయతీ విస్తరణ అధికారి అన్నపూర్ణదేవికి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్ర మంలో వైస్ ఎంపిపి తోట తిరుపతిరావు, వైసిపి మండల అధ్యక్షులు జమ్ము స్వామినాయుడు, సర్పంచులు, పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బొబ్బిలి

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఎన్‌యుఎల్ఎం, మెప్మా ఆధ్వర్యంలో పొదుపు సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను మంగళవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మహిళలు స్వయం ఉపాధి కోసం రుణాలను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. రుణాలను సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధి చెందాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణ మాట్లాడుతూ స్వయం ఉపాధి కోసం మంజూరు చేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మహిళలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, టిపిఆర్ఒ జగన్మోహన్, మెప్మా ఉద్యోగులు, కౌన్సిలర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అప్రమత్తంగా వ్యవహరించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గ్రామాల్లో జరుగుతున్న పరిణామాలు పట్ల మహిళా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్ఐ బి.గణేష్ సూచించారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్లో ఆయన మహిళా పోలీసులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న పరిణామాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా బెల్ట్ షాప్‌లు, అక్రమ బాణా సంచా దుకాణాలు నిర్వహిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. మహిళల భద్రత కోసం తీసుకు వచ్చిన పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు.

మహిళా పోలీసులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ

ఆర్‌టిసిలో నియామకాలు చేపట్టాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఆర్‌టిసి డ్రైవర్, మెకానిక్, కాంట్రాక్టర్ తదితర శాఖలకు సంబంధించి నియామకాలను తక్షణమే చేపట్టాలని ఎన్ఎంయు రాష్ట్ర కార్యదర్శి వై. శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం విజయనగరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ పరిస్థితి మెరుగ్గా ఉండటం వల్లే నాలుగు వేల కొత్త బస్సులను కొనడానికి ప్రభుత్వం సిద్ధమవుతుందన్నారు. రిక్రూట్‌మెంట్ జరిగితే సిబ్బందిపై పనిభారం తగ్గి ప్రయాణికులు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆర్టీసీ గ్యారేజ్‌కు సంబంధించి స్పేర్స్, టూల్స్ తక్షణం సప్లయి చేయాలని కోరారు. అత్యవసర సమయంలో సెలవులు ఇవ్వాలని, ప్రధానంగా మరుగుదొడ్ల సమస్య పరిష్కరించాలని కోరారు. ఆర్‌టిసిలో చనిపోయిన కార్మికులకు పిల్లలకు మెడికల్ అండ్ ఫిట్ అయిన వారి పిల్లలకు ఉద్యోగాలు ఇంతవరకు ఇవ్వకపోవడంతో ఆ కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నాయని, వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర జోనల్ ప్రెసిడెంట్ వి . ప్రదీప్ కుమార్, జోనల్ సెక్రెటరీ బిఎస్సార్ రాములు, రాష్ట్ర కార్యదర్శి కె.నర్సింగరావు, ఎస్ .సిమ్మయ్య, జిల్లా అధ్యక్షులు పిజి రాఫెల్, మూడు జిల్లాల ఆర్‌టిసి కార్మికులు పాల్గొన్నారు.

సీతం విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

స్థానిక సీతం విద్యాసంస్థలో మూడో సంవత్సరం చదువుతున్న మెకానికల్ విద్యార్థులు పారిశ్రామిక సందర్శనలో భాగంగా విశాఖలోని ఎపి మెడికో టెక్నాలజీ హబ్ (ఎఎంటిజెడ్) సందర్శించారు. పరిశ్రమ లు ఎలా ఏర్పడ్డాయి, వాటి ప్రాముఖ్యతను ఇన్నోవేషన్ సెమినార్ హాల్ లో ఇంటరాక్షన్ జరిగింది. కంపెనీ ఉద్యోగులు విద్యార్థులకు అనేక అవకాశాలను వివరించారు. మెకానికల్ విభాగ ఉపాధ్యాయులు డి.చైతన్య, సిహెచ్ తేజస్వి, టి.నరేంద్ర గోపి పాల్గొన్నారు.

ఉద్యోగులకు క్రీడా పోటీలు

విజయనగరం టౌన్ : సివిల్ సర్వీసు ఉద్యోగుల జిల్లా స్థాయి క్రీడా పోటీలు మంగళవారం స్థానిక రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో ఉత్సాహంగా జరిగాయి. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ఈ పోటీలను ప్రారంభించారు. వాలీబాల్, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, చదరంగం, కబడ్డీ, అథ్లెటిక్స్ విభాగంలో ఉద్యోగులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన నవంబర్ 6 తేదీ నుంచి 9 వరకు విజయవాడలో జరగనున్న రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని డిఎస్ఒ తెలిపారు.

21 మద్యం బాటిళ్లు పట్టివేత

విజయనగరంకోట: జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్ర రావు ఆదేశాల మేరకు చింతలవలసలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అక్రమంగా నిల్వ వుంచిన 21 మద్యం బాటిల్స్ తో సహా ఒక వ్యక్తిని పట్టుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ రాజశ్రీ తెలిపారు. ఈ దాడిలో ఎస్.ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

మందుగుండు షాపులపై కేసులు నమోదు

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని కెఎల్‌పురం సమీపంలోను, జామి మండలం జడ్డేటివలసలోను పలు మందుగుండు సామాగ్రి షాపులపై లీగల్ మెట్రాలజీ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించి 7 షాపులపైన, 5 కంపెనీలపైనా కేసులు నమోదు చేశారు. కొంతమేర స్టాక్ సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో తయారీ తేదీలు లేకపోవడం, విక్రయ ధర లేకపోవడం, ధరలు మూసి ప్రత్యేక స్టికర్ అంటించడం, కంపెనీ చిరునామాలు లేనట్లు తేలిందని ఇన్‌స్పెక్టర్ ఎం.దామోదర నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా వినియోగదారులతో కూడా మాట్లాడి తూకంలో గానీ, కొలతలో గానీ తేడా ఉన్నా, ఎవరైనా వ్యాపారస్తులు మోసం చేసినా, ఏవైనా ప్యాకేజిలపై ముద్రించిన ధర కంటే అధికంగా విక్రయించినా తమ శాఖకు ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు.

నేరాలు ఘోరాలు

అగ్నిప్రమాదంలో మహిళకు గాయాలు

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని మల్లంపేట గ్రామానికి చెందిన పట్నాన శివకుమారి (55) ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురైందని ఎస్ఐ తారకేశ్వరరావు అన్నారు. ఆయన చెప్పిన వివరాలు ప్రకారం.. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో వేడి నీరు కోసం కట్టెల పొయ్యి వెలిగించుకొని బయటకు వెళ్లి వచ్చేసరికి నీరు బాగా వేడెక్కడంతో దించిన సమయంలో చీరకి అగ్గి అంటుకుందని దీంతో కాలుకి, నడుం దగ్గర బాగా కాలిపోవడంతో బాడంగి సామాజిక ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఆస్పత్రికి తరలించారని అన్నారు. భర్త ఐదేళ్ల క్రితమే చనిపోయాడని సంతానం ఏమి లేదని, తల్లి వృద్ధాప్యంతో ఇంట్లోనే ఉందని చెప్పారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.